క్లుప్తంగా

నేక్ సెంటర్‌లో రేపు జాబ్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్) సెంటర్‌లో ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి హరిశ్చంద్రప్రసాద్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో నాలుగు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ/ఇంటర్/డిగ్రీ విద్యార్హతలున్న, 19 నుంచి 30 ఏళ్లున్న అభ్యర్థులు అర్హులన్నారు. అర్హులైన వారు బొమ్మూరు నేక్ సెంటర్‌లో ఈ నెల 9న జాబ్ మేళాకు హాజరు కావాలని చెప్పారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతు పనుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ సోమవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కలిగే అంతరాయంతో హౌసింగ్ బోర్డ్ కాలనీ, ధర్మపురి కాలనీ, మృత్యుంజయ నగర్, లక్ష్మీనగర్, పంచాయత్ ఆఫీస్ ఏరియా, ఏడు ఎకరాల లేఔట్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేయనున్నట్టు తెలిపారు.

కడియం ఎంపీడీవోగా రమేష్


రమేష్

కడియం: స్థానిక ఎంపీడీవోగా కే రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన రాజానగరం మండలం కోరుకొండ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన కే రత్నకుమారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలానికి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. సోమవారం పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిశారు.

కోలమూరు పంచాయతీ కార్యదర్శిగా ద్విభాష్యం


ద్విభాష్యం శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా ద్విభాష్యం శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీ జయరెడ్డి కోనసీమ జిల్లా చొప్పెల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుని, ప్రజాప్రతినిధుల సూచనలతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి ఆకెళ్ల వరప్రసాద్‌కు జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

పట్టాలెక్కనున్న ప్రగతి

కడియం: రాష్ట్రాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేస్తే కూటమి గాడిలో పెడుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని దామిరెడ్డిపల్లి గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్న మల్టీపర్పస్ యాక్టివిటీ సెంటర్‌కు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వలేదని, అయినా కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి రత్నం అయ్యప్ప, ఎంపీటీసీ సభ్యులు విత్తనాల సాయికుమార్, దామిరెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ ముద్రగడ సత్య స్వరూప, ఉప సర్పంచ్ ముద్రగడ వీరేష్ బాబుపాల్గొన్నారు.

కలశాల ఊరేగింపు

సీటీఆర్ఐ: దేవీ నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా 300 మంది మహిళలతో కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కోరుకొండ రోడ్డులోని శ్రీసాయి కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం జొన్నాడ వీర వెంకట సుబ్బారావు, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. 300 మంది మహిళలతో కలశాల ఊరేగింపు నిర్వహించారు. గరగనృత్యం, కోయ డాన్స్, మేళతాళాలతో ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించడంపై కేసు

కంబాలచెరువు: తనను కులంపేరుతో దూషించాడని ప్రకాశ్‌నగర్‌కు చెందిన చెలికి శాంతారామ్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదైంది. అట్ట పెట్టెల ఫ్యాక్టరీ నిర్వహించే తనను తరాల శ్రీనివాస యాదవ్ అనే వ్యక్తి దౌర్జన్యం చేస్తూ, బెదిరించాడన్నారు. దీనిపై అతను వేరే వ్యక్తులతో ప్రెస్‌మీట్ పెట్టించి తనపై తప్పుడు ప్రచారం చేశాడన్నారు. శ్రీనివాస్ యాదవ్ తాను ఎదురైన సందర్భంలో కులం పేరుతో దూషించాడని శాంతారామ్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై సదరు వ్యక్తి ప్రసార మాధ్యమాల్లోను, ఇతర విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని తెలిపాడు. దీనిపై ప్రకాశ్‌నగర్ పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వరిపై ఎండాకు దాడి

- ఆందోళనలో రైతులు
- వాతావరణ పరిస్థితులే కారణం!
- అమోనియా ఎరువుల వాడకం తగ్గించాలంటున్న నిపుణులు


కడియం మండలం దుళ్లలోని వరి పైరు

కడియం: ప్రస్తుతం వాతావరణంలో వరిపై తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా ఎండాకు తెగులు అధికంగా ఆశించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగవుతోంది. ప్రస్తుతం వరి పంటపై బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆందోళనకు గురిచేస్తోంది. వరి దుబ్బులో కొన్ని ఈనెలు నిలువునా ఉండిపోయి కుళ్లిపోతున్నాయి. దీనిని వ్యవసాయ నిపుణులు బ్యాక్టీరియా ఎండాకు తెగులుగా చెబుతున్నారు. సాధారణంగా నీడగా ఉండే ప్రాంతాల్లో ఇదే లక్షణాలతో వరి దుబ్బులు ఉంటాయని, వాటిని తాటాకు తెగులుగా రైతులు చెబుతుంటారు. ఈ తాటాకు తెగులు నివారణకు రసాయనిక మందులు కూడా పనిచేస్తుంటాయి. అయితే బ్యాక్టీరియా ఎండాకు తెగులుకు ప్రస్తుతం ఏ రసాయనిక మందులు పనిచేయవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తాటాకు తెగులుగా భావించి అధికంగా రసాయనిక మందులను వినియోగించడం వల్ల ప్రయోజనం లేదని వారు వివరిస్తున్నారు. కాగా కడియం మండలంలోని కడియం, వేమగిరి, జేగురుపాడు, మురమండ, దుళ్ల తదితర ప్రాంతాల్లో ఈ బ్యాక్టీరియా ఎండాకు తెగులును వ్యవసాయాధికారులు గుర్తించి, తెగులును అదుపు చేసేందుకు పలు జాగ్రత్తలను వివరిస్తున్నారు. అలాగే పొలంబడి కార్యక్రమంలో ప్రత్యేకంగా ఈ తెగులును అదుపు చేసేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పొటాష్ వినియోగించకపోవడం వల్లేనా..

సాధారణంగా వరి సాగులో రెండు దఫాలుగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంవోపీ)ను వినియోగించాలి. అయితే బస్తా ధర రూ.1500 వరకు ఉండడంతో రైతులు ఎంవోపీ వినియోగించడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా మొలాసిస్ పొటాష్ కూడా ఉన్నప్పటికీ దీనిపై రైతులకు అవగాహన లేకపోవడంతో వినియోగానికి దూరమవుతున్నారు. పొటాష్ వినియోగం కొరవడడంతో వరిపై తెగుళ్ల దాడి ఎక్కువగా ఉంటోందని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట, గింజలు పాలుపోసుకునే స్థితిలో ఉందని, రెండో కోటాగా ఇప్పుడైనా పొటాష్‌ను వినియోగిస్తే గింజ నాణ్యత పెరగడంతోపాటు, ప్రస్తుతం వ్యాపించే అనేక తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చునని చెబుతున్నారు. అధిక వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరిపై తెగుళ్ల దాడి ఎక్కువగా ఉంటోందని, వీటిని తట్టుకునే శక్తి పైరుకి రావాలంటే ఎంవోపీ వాడాల్సి ఉంటుందని వివరిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

> ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాక్టీరియా ఎండాకు తెగులుపై నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ తెగులును పూర్తిగా నివారించేందుకు ఎటువంటి రసాయనిక మందులు పనిచేయవు. ఇప్పటికే పలువురు శాస్త్రవేత్తలు కూడా కడియం ఆవ, మురమండ, జేగురుపాడు గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు, తాటాకు తెగులుకు తేడాను రైతులు గుర్తించాలి. గ్రామాల్లోని వ్యవసాయశాఖ సిబ్బందిని నేరుగా సంప్రదించి మరిన్ని సలహాలు పొందవచ్చును.
>
> – కే ద్వారకాదేవి, వ్యవసాయాధికారి, కడియం

తెగులును గుర్తించాలిలా..

ఎండుతున్న వరి ఈనెలను కట్ చేసి పారదర్శకంగా ఉన్న గ్లాసులో నీటిని వేసి సుమారు అరగంట తరువాత చూస్తే బ్యాక్టీరియా తీవ్రత కారణంగా కసరు దిగుతుంది. ఇలా కసరు దిగితే అది బ్యాక్టీరియా ఎండాకు తెగులుగా భావించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్లాంటోమైసిన్, కాపరాక్సీక్లోరైడ్ వంటి రసాయనిక మందులను వినియోగిస్తే బ్యాక్టీరియా ఎండాకు తెగులు మరింతగా వ్యాపించకుండా నివారించుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా అమోనియా ఎరువులను వినియోగిస్తే బ్యాక్టీరియా ఎండాకు తెగులు అధికమవుతుందంటున్నారు. దీనిపై రైతులు అవగాహన పెంచుకోవాలని కోరుతున్నారు.

ప్రతి అర్జీకి న్యాయం చేయాలి

ఆర్డీఓ కృష్ణ నాయక్

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయాలని ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్ డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన 'పీజీఆర్ఎస్-మీ కోసం' వేదికలో వచ్చిన అర్జీలను డివిజన్ స్థాయి అధికారులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పీజీఆర్ఎస్ – మీ కోసం' ద్వారా ప్రజల నుంచి ఆరు అర్జీలను స్వీకరించామన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదానికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. గోకవరం మండలం రంప ఎర్రవరం గ్రామస్తులు పాటి సీత, జక్కంపూడి లక్ష్మి వారి అర్జీల్లో 35 కిలోల బియ్యం అందించే అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని కోరారు. గోకవరం మండలం రంప ఎర్రవరం గ్రామస్తులు పతి సీత తమ అర్జీలో తనకు వయస్సు 43 సంవత్సరాలు, గోకవరం మండలం రంపయర్రంపాలెం నివాసం ఉంటున్నానని, పోలియో వలన శాశ్వత వైకల్యంతో బాధపడుతున్న తనకు 49 శాతం మాత్రమే అంగన్వాడీ వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారని, మరో మారి వైద్యులు పరిశీలించి పూర్తి అంగన్‌వాడీ వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని కోరారు. రాజానగరం మండలం నందరాడ గ్రామానికి చెందిన చెరుకూరి సుబ్బలక్ష్మి తన భూమి ఆన్‌లైన్ 30 సెంట్లు తక్కువ ఉందని, సంస్థను పరిష్కరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని వారి అర్జీలు కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

సమస్యల పరిష్కారానికి నిరంతర చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని మున్సిపల్ అదనపు కమిషనర్ ఎస్.వి.రమణరావు (ఇన్‌చార్జ్)తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 16 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఓ జి.కోటయ్య, ఎస్ఈ జి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

పీజీఆర్ఎస్‌లో 34 అర్జీల స్వీకరణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం'(పీజీఆర్ఎస్)కు 34 అర్జీలు వచ్చాయి. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అర్జీలకు నాణ్యతతోపాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు. అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ అలీ ఖాన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో సమస్యలు పరిష్కరించండి


విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో విలేకరుల మాట్లాడుతూ నగరంలో సమస్యలపై నగర పాలక సంస్థ అధికారులకు వినతిపత్రం అందించామన్నారు. మురికికాలువల నీరు సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని, పనులు పూర్తయిన కందుకూరి వీరేశలింగం పురమందిరం, దానవాయిపేట మున్సిపల్ గాంధీ పార్కులను ప్రారంభించాలన్నారు. గోదావరి రేవుల నీటిలో చెత్త తొలగించాలని, సీతంపేట వాటర్ ట్యాంకుల సెంటర్లో ట్రాఫిక్‌కి సమస్యను పరిష్కరించాలని టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్లే దారిలో రైల్వే అండర్ గ్రౌండ్ దగ్గర వాటర్ నిలబడకుండా చూడాలని కోరినట్టు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మార్టిన్ లూథర్, చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అమీర్ పాషా, క్వారీ ఏరియా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శేషుబాబు, అబ్దుల్లా షరీఫ్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు జాల నటరాజ్, ఏపీ పీఎం ఎక్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్‌వీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, చీరల పంపిణీ


వృద్ధురాలికి చీర, దుప్పటి అందజేస్తున్న రవి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డీ బ్లాకులోని జీవమార్గ సంఘ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సత్యచారి టబుల్ ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సోమవారం అనాథ వృద్ధాశ్రమంలో జరిగిన ఉజ్జీవ మహాసభలో సత్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ టి.రవి మాట్లాడుతూ అతి చిన్న టెంట్‌హౌస్ నిర్వహించుకుంటూ, వ్యయ ప్రయాసలపడి ప్రభాకర్ వృద్ధాశ్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సత్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వృద్ధాశ్రమాన్నికి మరిన్ని సేవలు చేస్తూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, ప్రభాకర్, పాస్టర్లు, వలంటీర్లు, వృద్ధాశ్రమం సభ్యులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీగా అమ్మ..

సీటీఆర్ఐ: సర్వాలంకారభూషితురాలు దుర్గమ్మ ఐదో రోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. శ్రీచక్రానికి అధిష్టాన దేవతగా, పంచదశాక్షరీ మహామంత్రాది దేవతగా ఖ్యాతినొందిన లలితమ్మ ఓ చేతిలో చెరకుగడ మరోక చేతితో భక్తులకు అభయాన్నిస్తున్నట్లుగా దర్శనమిచ్చారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలోని అన్ని అమ్మవారి దేవాలయాలలో వివిధ రూపాలలో అలంకరించారు . దేవీచౌక్‌లో అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయ స్వామి వారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని పాస్తాలు, వడియాలతో అలంకరించారు. స్థానిక బలరామపేటలోని అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో కాశి అన్నపూర్ణదేవిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. సరస్వతీ ఘాట్, శంకర మఠం, శారద పీఠం, అక్షర కోటి గాయత్రీ శ్రీచక్ర పీఠం, ఉమా కోటి లింగాల దేవాలయం, ఉమా రామలింగేశ్వర ఆలయం, సారంగధరేశ్వర స్వామివారి ఆలయంలో వివిధ రకాలలో అమ్మవారిని అలంకరించారు.


బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారం


అన్నపూర్ణాదేవి అలంకారం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లో ఉన్న విజయ కనకదుర్గాదేవి ఆలయంలో 34వ శరన్నవరాత్ర ఉత్సవాలలో ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో అమ్మవారిని భువనేశ్వరిదేవి అమ్మవారిగా అలంకరించినట్టు ఆలయధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు.

పిచ్చిమొక్కలు తొలగించేశారు..

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు బొమ్మూరు మహిళాప్రాంగణం ఆవరణలో ఉన్న ఐసీడీఎస్, డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వెనుక ఉన్న పిచ్చిమొక్కలతోపాటు పరిసరాలను జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి సోమవారం శుభ్రం చేయించారు. దీంతో ఆ ప్రాంతం సుందరంగా కనిపించింది. ఈనెల ఆరో తేదీన సాక్షిదిన పత్రికలో 'అడవులు కాదు.. ఆఫీసులేనండి' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. అలాగే రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇన్‌చార్జి తహసీల్దార్ జే.రమ్య తహసీల్దార్ గది వెనుక భాగంతోపాటు, కార్యాలయ ఆవరణమంతా పొక్లెయిన్‌తో శుభ్రం చేయించారు.


ఐసీడీఎస్, డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వెనుక శుభ్రం చేసిన దృశ్యం


తహసీల్దార్ కార్యాలయం వెనుక ...


తహసీల్దార్ గది వెనుక శుభ్రం


పిచ్చిమొక్కలు తొలగించడంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద కనిపిస్తున్న బోర్డు